సాక్షి
నిజామాబాద్



గౌరవ వేతనం అందేదెప్పుడు?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సమగ్ర సర్వేలో పాల్గొన్న సిబ్బందికి ఇప్పటి వరకు గౌరవ వేతనం అందలేదు.

- 8లో ▸



సదరం శిబిరాల్లో..

సదరం శిబిరాలకు వచ్చే వారికి అన్ని నదుపాయాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ హనుమంతు ఆదేశించారు.


- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /17.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

ఆదివారం । 2 । మార్చి । 2025



న్యూస్‌రీల్

6 నుంచి రైల్వేగేట్ మూసివేత



ఎడపల్లి(బోధన్): అండర్ పాస్ నిర్మించనున్న నేపథ్యంలో ఎడపల్లి మండలంలోని బషీర్‌ఫారం రైల్వే గేటును ఈ నెల 6 నుంచి మూసి వేయనున్నట్లు సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎడపల్లి తహసీల్, పోలీస్‌స్టేషన్, మండలంలోని పోచారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి రైల్వే అధికారులు ముందస్తుగా నోటీసులు అందించారు. గతంలో రైల్వేగేటును మూసి వేయడంతో తాము ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం అండర్ పాస్ నిర్మాణం పేరుతో మళ్లీ గేటును మూసివేస్తున్నారని పోచారం గ్రామస్తులు అంటున్నారు.

డెమో రైలు రద్దు

ఖలీల్‌వాడి: రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో కాచిగూడ – నిజామాబాద్ మధ్య నడిచే డెమో రైలును రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెలాఖరు వరకు (77601/77602) డెమో రైలు రాకపోకలు రద్దు చేశామని, ప్రయాణికులు గమనించాలని సీపీఆర్వో శ్రీధర్ కోరారు.

అంకితభావంతో పని చేయాలి



బోధన్: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. ఔషధ నిల్వలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. శిథిలావస్థకు చేరిన ఆరోగ్య కేంద్రం పాత భవనాన్ని పరిశీలించి కొత్త భవనం మంజూరు వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

తలుపు బిగింపు



సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: ముప్కాల్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీలోని మూత్రశాలలకు బొంతలు కట్టిన వైనంపై 'సాక్షి'లో 'బొంతలే.. తలుపులు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ప్రధాన ద్వారానికి తలుపు బిగించారు. తలుపు బిగించడంపై హర్షం వ్యక్తం చేసిన విద్యార్థినులు నూతన భవన నిర్మాణ పనులను కూడా వెంటనే పూర్తి చేయించాలని కోరారు.

డిగ్రీ, పీజీలో ప్రవేశాలకు అవకాశం

నిజామాబాద్‌అర్బన్: ప్రొఫెసర్ రామ్‌రెడ్డి దూరవిద్యా కేంద్రంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు కో ఆర్డినేటర్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీలో డిప్లొమా కోర్సుల్లో రెండో దఫా ప్రవేశాలకు అవకాశం ఉందని, ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99126 70252 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కళలకు ప్రాణం చిన్నారులకు నాట్యం



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న నాట్య గురువు సరోజ ప్రియదర్శిణి (ఫైల్)

- ఆదర్శవంతమైన నాట్య గురువులు
- కూచిపూడి, ఆంధ్ర, పేరిణి, జానపద నాట్యరీతుల్లో శిక్షణ
- దేశ, విదేశాల్లో వందల సంఖ్యలో ప్రదర్శనలు
- నాట్యమయూరాలను తీర్చిదిద్దుతున్న కళామతల్లి సేవకులు
- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న శిష్యులు

నాట్యంపై మమకారం.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత శిఖరాలకు ఎదిగారు. ముచ్చటైన హావభావాలతో నాట్యం చేస్తూ మంత్రముగ్ధుల్ని చేస్తారు. అపారమైన ప్రతిభ గల వీరంతా ఆదర్శవంతమైన నాట్య గురువులుగా రాణిస్తున్నారు. ప్రాచీన కళకు ప్రాణం పోస్తూ.. చిన్నారులను నాట్యమయూరాలుగా తీర్చిదిద్దున్నారు. తాము నేర్చుకున్న సంప్రదాయ కళకు ప్రాంతీయ రంగు పులుమకుండా కూచిపూడి, పేరిణి నాట్యం, జానపద నృత్య రీతులను చిన్నారులకు నేర్పిస్తున్నారు ఆర్మూర్‌కు చెందిన బాశెట్టి మృణాళిని, సరోజ ప్రియదర్శిణి, జయలక్ష్మిలు. కళామతల్లి సేవలో ఉంటూ వీరి శిష్యులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా చేస్తున్న నాట్యగురువులపై ప్రత్యేక కథనం.. – ఆర్మూర్



నృత్య భంగిమలతో ఆకట్టుకుంటున్న నాట్య గురువు బాశెట్టి మృణాళిని



సరోజ ప్రియదర్శిణి

విజయవాడకు చెందిన వెంకట రమణమ్మ, సాంబశివ శర్మల కూతురు సరోజ ప్రియదర్శిణి తన 6వ ఏట నుంచే గురువులు పార్వతీశం, శంకర్ వద్ద ఫోక్ డ్యాన్స్ నేర్చుకుంది. 11వ ఏట నుంచి క్లాసికల్ డ్యాన్స్‌ను నేర్చుకోవాలనే తపనతో శైలజారెడ్డి, వేదాంతం రాధేశ్యాంల వద్ద కూచిపూడి నృత్యం నేర్చుకోవడం ప్రారంభించింది. 13 ఏళ్ల చిరుప్రాయంలో అరంగేట్రం చేసి ఇక వెనక్కి తిరిగి చూడలేదు. 22 ఏళ్లలో దేశ, విదేశాల్లో 500 పైగా నాట్య ప్రదర్శనలతో వందల సంఖ్యలో అవార్డులను కై వసం చేసుకున్నారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి చేతుల మీదుగా ఆస్థాన నర్తకి, జాతీయ స్థాయిలో నాట్య విజ్ఞాన్ అవార్డు, కళాపీఠం వారి కళాభూషణ్ అవార్డులు ఆమె నాట్య నైపుణ్యానికి అందిన మచ్చుతునకలు. 2008లో వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన సుధీర్ శర్మతో వివాహం జరగడంతో ఇద్దరు పిల్లలు శివరామకృష్ణ, ప్రోక్షితతో కలిసి ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో స్థిరపడ్డారు. 2012లో నిజామాబాద్ కేంద్రంలోని జ్ఞాన సరస్వతీ సంగీత, నృత్య పాఠశాలలో నాట్య గురువు దేవులపల్లి ప్రశాంత్ వద్ద శిష్యరికం చేసి కూచిపూడిలో డిప్లొమా పూర్తి చేశారు. అదే ఏడాది మామిడిపల్లిలో భారతి నృత్యనికేతన్ (కీర్తన నృత్యనికేతన్)ను స్థాపించారు. కూచిపూడి లాంటి సంప్రదాయ నృత్యాలను చిన్నారులు నేర్చుకోవడంతో వారిలో సనాతన సంస్కృతి, సంప్రదాయాలు అలవడుతాయని తెలుపుతున్నారు.



సరోజ ప్రియదర్శిణి

వెయ్యికి పైగా శిష్యులు

బాశెట్టి మృణాళిని, నాట్య గురువు, ఆర్మూర్



ఆర్మూర్ పట్టణంలోని బాశెట్టి మహిపాల్, లక్ష్మి సంతానమైన బాశెట్టి మృణాళిని ఏడేళ్ల ప్రాయం నుంచే నాట్యంపై మక్కువ కనబర్చారు. 2015లో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఆంధ్ర నాట్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, కూచిపూడిలో డిప్లొమా పూర్తి చేశారు. నాట్య గురువు డాక్టర్ సువర్చల వద్ద శిష్యరికం చేసి నిష్ణాతురాలిగా మారారు. సుమారు 600 పైగా ప్రదర్శనలు ఇచ్చి అవార్డులను కైవసం చేసుకున్నారు. 20 ఏళ్లుగా ఆర్మూర్‌లోని నటరాజ నృత్యనికేతన్‌లో సుమారు వెయ్యి మందికి పైగా చిన్నారులకు కూచిపూడి, ఆంధ్రనాట్యం, పేరిణి నాట్యం, జానపద నృత్య రీతులను నేర్పించారు. కూతురు సాయిశృతిని సైతం నృత్య కళాకారిణిగా తీర్చిదిద్దారు. 2024 సెప్టెంబర్‌లో కల్చరల్ అండ్ ఆర్ట్స్ విభాగంలో ఆమె అందిస్తున్న సేవలను గుర్తించిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

సండే స్పెషల్



కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్న తన శిష్యులతో నాట్య గురువు సరోజ ప్రియదర్శిణి (ఫైల్)

కళా పోషకుడు మాడవేడి..



ఎంతటి కళలైనా సరే పోషకులు లేని పక్షంలో మరుగున పడిపోతాయి. కాగా ఆర్మూర్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మాడవేడి నారాయణ కళామతల్లి పోషకుడిగా కొనసాగుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. 2001 సంవత్సరంలో ఆర్మూర్ పట్టణంలో నటరాజ నృత్యనికేతన్‌ను స్థాపించి 2005లో రిజిస్ట్రేషన్ చేయించారు. నాటి నుంచి పలువురు నాట్య గురువుల సహకారంతో చిందు, కూచిపూడి, ఆంధ్ర నాట్యం, పేరిణి నాట్యం, జానపద నృత్య రీతులను నేర్పిస్తూ సంప్రదాయ కళలను అంపశయ్యపైకి వెళ్లకుండా కాపాడుతున్నారు. అంతరించిపోతున్న చిందుకళను ప్రోత్సహించి ఇందిరాగాంధీ హయాంలో ఢిల్లీలో ప్రదర్శనలిప్పించిన ఘనత నారాయణది. ఆయన స్థాపించిన నటరాజ నృత్యనికేతన్‌లో వెయ్యికి పైగా చిన్నారులు సంప్రదాయ నృత్యరీతులను నేర్చుకోవడం విశేషం.



గౌరవ డాక్టరేట్ స్వీకరిస్తున్న నాట్య గురువు బాశెట్టి మృణాళిని (ఫైల్)

కాకతీయుల నాటి పేరిణి నాట్యం

కాకతీయ చక్రవర్తుల కాలంలో యుద్ధ సన్నాహక నృత్య విశేషంగా మొదలైందీ పేరిణి నృత్యం. ఇతర శాస్త్రీయ నృత్యాలకన్నా విశిష్టత కలిగింది. జయపసేనాని మొదలుకొని ఈ నాట్య శైలితో రామప్ప ఆలయ అంతర విగ్రహాలు అలంకరిచబడటం వరకు పేరిణి నృత్య వికాసంలో ప్రతీది విశిష్టాంశమే. ఆ తర్వాత కనుమరుగైపోయిన పేరిణి నృత్యం నటరాజ రామకృష్ణ సారథ్యంలో పునర్వైభవం సంతరించుకున్నది. తెలంగాణలో పేరిణి నృత్యం నవశక్తిగా ఊపిరిపోసుకుంటోంది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ శాస్త్రీయ నృత్య రీతి అయిన పేరిణి ద్వితీయ శ్రేణి నృత్య రీతిగానే మిగిలిపోయింది. ప్రస్తుతం రాష్ట్ర శాస్త్రీయ నృత్య రీతి అయిన పేరిణి తాండవానికి తెలంగాణ ఆలయ ఆస్థానాలల్లో లాస్య నర్తనరీతిని కూడా కలుపుకొని పేరిణి నాట్యంగా రూపుదిద్దుకుంది.

చిన్నారుల్లో తపన ఉండాలి



పేరిణి, ఆంధ్ర నాట్యం, కూచిపూడి లాంటి సంప్రదాయ నృత్యాలను చిన్నారులు నేర్చుకోవడంతో ఏకాగ్రత పెరిగి చదువుల్లో సైతం రాణిస్తున్నారు. లాభాపేక్ష లేకుండా కళామతల్లి సేవలో తరించడం మానసికానందాన్నిస్తోంది. కూచిపూడిని ఆదరిస్తూ తమ పిల్లలకు నేర్పించడానికి తల్లిదండ్రులు సైతం ఆసక్తి చూపడం ఆనందంగా ఉంది. చిన్నారుల్లో నేర్చుకోవాలనే తపన ఉన్నా పేరిణి నాట్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కళాకారులకు గుర్తింపు రావడం లేదు. ఇలాంటి వారికి ప్రభుత్వ పాఠ్యశాలలో పేరిణి నాట్యాన్ని చేరిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. – జయలక్ష్మి, సీనియర్ నాట్య గురువు, నిజామాబాద్

ప్రతి గుంటకు నీరందాలి

- పంటలు గట్టెక్కేలా చర్యలు తీసుకోండి
- ఇరిగేషన్ అధికారులతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రధాన కాలువ పరిధిలోని ప్రతి గుంటకు సాగు నీరు అందించి, పంటలు గట్టెక్కేలా చూడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉమ్మడి జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. గుల్‌దస్తా రెస్ట్ హౌస్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ సీఈలు శ్రీనివాస్, మధుసూదన్, ఎస్ఈలు, డీఈఈలు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు. చివరి ఆయకట్టు గట్టెక్కేవరకు నీటిని విడుదల చేయాలన్నారు. ప్రాజెక్టు నీరు వృథా కాకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.25 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్న పంటలను పూర్తిస్థాయిలో గట్టెక్కిస్తామని, నీటి కోసం రైతులు ఆందోళన చెందకుండా అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నిజాంసాగర్ నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్ తదితరులు పాల్గొన్నారు.

చివరాయకట్టు వరకు నీరు

బోధన్/ఎడపల్లి: నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు ప్రాంతమైన డి–28 కాలువ కింద పంటలకు నీరందించేందుకు చర్యలు చేపట్టామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సాలూర మండలంలోని సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్, బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామాల శివారులో డి–28/14 కాలువలో నీటి పారకం, పంటల పరిస్థితిని, ఎడపల్లి మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు డి–46 కాలువ ఆయకట్టును శనివారం ఆయన పరిశీలించారు.



సాలూర క్యాంప్ వద్ద డి-28 కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఆయాగ్రామాల్లో రైతులతో మాట్లాడారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోకుండా నీరందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులను అప్రమత్తం చేశామన్నారు. అలీసాగర్ ఎత్తిపోతల పథకం కింద 53 వేల ఎకరాలు, నిజాంసాగర్ డి–46 కాలువ కింద 12 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు, నీరు వృథా పోకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి సరఫరా గడువు ఈ నెల 3తో ముగియనుందని, మరి కొన్ని రోజులు పెంచాలని రైతులు ఎమ్మెల్యేను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు నాగేశ్వర్‌రావు, అల్లె రమేశ్, చిద్రపు అశోక్, నరేందర్‌రెడ్డి, సుందర్‌రాజ్ తదితరులు ఉన్నారు.

దిమ్మ తిరిగే దిగుబడి!

- ఎకరానికి 12 ట్రాక్టర్ల పసుపు
- ఆదర్శంగా నిలుస్తున్న డొంకేశ్వర్ రైతు గోక నారాయణ
- ఆశ్చర్యపోతున్న తోటి రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): తనకున్న ఎకరం భూమిలోనే పసుపు సాగు చేస్తున్న రైతు గోక నారాయణ అద్భుత దిగుబడులు సాధిస్తున్నాడు. డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన నారాయణ గత ఆరేళ్లుగా పసుపు సాగు చేస్తున్నాడు. నేల స్వభావమో, ఎరువుల పనితమో లేదా రైతు చేతి గుణమో తెలియదు కానీ.. ఎకరానికి పన్నెండు ట్రాక్టర్ల పసుపు దిగుబడి వస్తోంది. అన్ని పద్ధతులు పాటించి సాగు చేస్తేనే కష్టం మీద ఎకరానికి ఎనిమిది ట్రాక్టర్ల దిగుబడి (25 నుంచి 30 క్వింటాళ్లు) వస్తుంది. అలాంటిది గోక నారాయణకు ఎకరానికి పన్నెండు ట్రాక్టర్ల (దాదాపు 40 క్వింటాళ్లు) దిగుబడి రావడం ఆశ్చర్యపరిచే విషయమే. వరుసగా గత ఆరేళ్లుగా ఇదే దిగుబడిని రావడం తనను కూడా ఆశ్చర్యాన్ని గురిచేస్తోందని సదరు రైతు పేర్కొంటున్నాడు. అందరిలాగే తను కూడా పశువులు, గొర్ల ఎరువు ఉపయోగించడంతోపాటు డ్రిప్ ద్వారా పదిహేను రోజులకోసారి నత్రజని, పొటాష్, పాస్పరస్ అందిస్తానని 'సాక్షి'కి తెలిపారు. ప్రతి ఏటా సాంగ్లి మార్కెట్‌కు వెళ్లి పసుపు దిగుబడిని విక్రయిస్తున్నట్లు చెప్పాడు.



తన భూమిలో సాగైన పసుపు కొమ్ముల వద్ద రైతు గోక నారాయణ

సాగునీటి సమస్య తలెత్తితే మీరే బాధ్యులు

- సంబంధిత అధికారులకు స్పష్టం చేసిన కలెక్టర్ హనుమంతు
- బోధన్ ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో సమీక్ష సమావేశం
- నీటి చౌర్యంపై నిఘాపెట్టాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బోధన్: జిల్లాలో ఎక్కడైనా సాగు నీటి సమస్య ఉత్పన్నతమైతే సంబంధిత శాఖ అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. సాగు నీటి సరఫరాను సక్రమంగా పర్యవేక్షించకుండా అలసత్వాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. బోధన్ పట్టణంలోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి డివిజన్ స్థాయి నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టులు, చెరువులు, కాలువల కింద ఆయకట్టు పరిధిలోని పంటల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరుల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రధాన జలాశయాలైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులతోపాటు చెరువుల్లో నీటి నిల్వలు ఎక్కువగానే ఉన్నాయన్నారు. ఎక్కడా పంటలకు సాగు నీరందించే విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో నీటి చౌర్యం జరగకుండా నిఘా పెట్టాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ఎక్కడైనా సాగు నీటి సరఫరా కు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంటే ముందుగానే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలనిన్నారు. రానున్న నెలన్నర రోజులపాటు సాగు నీటి పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఉన్నతాధికారులకు సూచించారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతోపాటు ఇతర సంస్థల నుంచి రావాల్సిన ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వంద శాతం పన్ను వసూలయ్యేలా ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని, అయినప్పటికీ స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

యాసంగి సీజన్‌లో ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ హనుమంతు ఆదేశించారు. గతేడాది రబీలో 63 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించగా, ఈసారి 77 వేల మెట్రిక్ టన్నులకు డిమాండ్ పెరిగిందని పేర్కొన్నారు. జిల్లా రైతుల అవసరాలకు సరిపడా స్టాక్‌ను ముందుగానే తెప్పించుకుని అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటు ఉండేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

వర్సిటీ మైనారిటీ సెల్ డైరెక్టర్‌గా అబ్దుల్ ఖవి


ఉత్తర్వులు అందుకుంటున్న ఖవి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మైనారిటీ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవి నియమితులయ్యారు. తెయూ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి శనివారం అబ్దుల్ ఖవికి నియామక ఉత్తర్వులు అందజేశారు. గత పది సంవత్సరాలుగా ఆయన ఉర్దూ విభాగంలో అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. తనపై నమ్మకంతో మైనారిటీ సెల్ డైరెక్టర్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు అబ్దుల్ ఖవి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందూరు కవులకు ఘన సత్కారం


కాసర్ల నరేశ్‌రావును సన్మానిస్తున్న శ్రీ సరస్వతి కళాపీఠం నిర్వాహకులు

నిజామాబాద్ రూరల్: నగరానికి చెందిన ప్రముఖ కవులు డాక్టర్ గణపతి, అశోక్ శర్మ, డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, డాక్టర్ కన్యాల ప్రసాద్, చింతల శ్రీనివాస్ గుప్తను నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ సరస్వతి కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. బాసర ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, ప్రముఖ కళాకారుడు రఘు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ప్రత్యేకంగా కవులు, కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా కవులకు సరస్వతీపుత్ర అనే బిరుదును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

డీఎంను కలిసిన రేషన్‌డీలర్లు


డీఎంను సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

సుభాష్‌నగర్: సివిల్ సప్లయ్ డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌రెడ్డిని జిల్లా రేషన్ డీలర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంకు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అతిమేల నాగేశ్, గౌరవాధ్యక్షుడు పోల్కంగం గాకిషన్, ప్రధాన కార్యదర్శి పార్థ సారథి, నగర కార్యదర్శి ప్రవీణ్ యాదవ్, సంయుక్త కార్యదర్శి కిరణ్‌కుమార్, రాజారాం, రవి, రమేశ్, రవీంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్

బోధన్: బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని కమిషనర్ వెంకటనారాయణ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఏవైనా సందేహాలుంటే హెల్ప్ డెస్క్‌లో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికారిక లేవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరించేందుకు ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేస్తోందని పేర్కొన్నారు. 2020లో దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31 వరకు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా జీవో నంబర్ 28 ద్వారా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ నంబర్ 6301707191ను సంప్రదించాలని సూచించారు.

గౌరవ వేతనం అందేదెప్పుడు?

- సమగ్ర సర్వే ముగిసి నెలలు గడుస్తున్నా విడుదల కాని నిధులు
- సిబ్బందికి తప్పని నిరీక్షణ



మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సమగ్ర సర్వేలో పాల్గొన్న సిబ్బందికి ఇప్పటికీ గౌరవ వేతనం అందలేదు. సర్వే అనంతరం ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి గౌరవ వేతనం(అలవెన్సులను) అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నెలలు గడుస్తున్నా డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో ఎన్యుమరేటర్లు, పరిశీలన జరిపిన సూపర్‌వైజర్లు, ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసిన ఆపరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కొరతనే కారణమా?

జిల్లాలో సర్వే నిర్వహించిన వారికి భత్యం చెల్లించడానికి రూ.3,93,20,000లను విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా ప్లానింగ్ కార్యాలయం ద్వారా సర్వేలో పాల్గొన్న వారికి భత్యం జమ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థుల ఖాతాల నంబర్లను సేకరించి నెలలు గడచినా ఒక్కరికి కూడా నయాపైసా జమ కాలేదు. జిల్లా ప్లానింగ్ అధికారులను అభ్యర్థులు వాకబు చేస్తే ట్రెజరీకి బిల్లులు చేసి పంపించామని ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే భత్యం సొమ్ము జమ అవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఆర్థిక శాఖ వద్ద నిధుల కొరత తీవ్రంగా ఉండటంతోనే టోకెన్‌లు జారీ చేసినా భత్యం సొమ్ము జమ కావడానికి సమయం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమైతుంది. ప్రభుత్వం స్పందించి సమగ్ర సర్వేలో పాల్గొన్న సిబ్బందికి డబ్బులు జమ చేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో 3500 మంది ఎన్యుమరేటర్లు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాలు, పట్టణాల్లో కుటుంబాల వారీగా వివరాలను నమోదు చేయడానికి 3,500ల మంది ఎన్యుమరేటర్లను నియమించారు. సర్వే ఎలా కొనసాగుతుందో పరిశీలించడానికి 360 మందిని సూపర్‌వైజర్లుగా నియమించారు. ఎన్యుమరేటర్లకు రూ.10వేల చొప్పున, సూపర్‌వైజర్లకు రూ.12వేల అలవెన్సును అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లకే కంప్యూటర్ ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయించే బాధ్యత అప్పగించారు. అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లతోపాటు మీసేవ నిర్వాహకులు, కొందరు విద్యార్థులను ఆన్‌లైన్‌లో వివరాల నమోదు కోసం వినియోగించారు. వీరికి ఒక్కో కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి రూ.50 చొప్పున చెల్లిస్తామని అధికార యంత్రాంగం వెల్లడించింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి రుసుం చెల్లించలేదు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు అలవెన్స్‌లను జమ చేయడానికి ఖాతా నంబర్లను గతంలోనే మండల పరిషత్, మున్సిపల్ అధికారుల ద్వారా సేకరించారు. భత్యం చెల్లింపులో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకూడదనే ఉద్దేశ్యంతో సర్వేలో పాల్గొన్న వారి ఖాతా నంబర్లను ప్రభుత్వం సేకరించింది.

ఖాతా నంబర్లు పంపించాం..

సమగ్ర సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన కంప్యూటర్ ఆపరేటర్ల బ్యాంకు ఖాతా నంబర్లను చీఫ్ ప్లానింగ్ కార్యాలయానికి పంపించాం. ఖాతా నంబర్లు పంపించడంతో మా బాధ్యత తీరిపోయింది. అక్కడి నుంచి డబ్బులు జమ కావాల్సి ఉంది. ఇంకా మాకు ఎలాంటి సమాచారం లేదు.

– తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

క్రైం కార్నర్

కారును ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
- మరో నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన తల్లీకూతురు స్వరూప, చిట్టి


పూల్‌సింగ్ మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి తండాకు చెందిన పూల్‌సింగ్ (39) తన భార్య సునీత, చెల్లెళ్లు శోభ, వినీతతో కలిసి శనివారం కామారెడ్డిలో చదువుతున్న పిల్లల దగ్గరికి కారులో వెళ్లారు. అనంతరం స్వగ్రామానికి బయల్దేరారు. అదే సమయంలో నారాయణ్‌ఖేడ్‌కు చెందిన బంధువులు పూల్‌సింగ్‌కు ఫోన్ చేయగా, వారిని ఎల్లారెడ్డిలో ఎక్కించుకొని రాఘవపల్లితండాకు వెళ్తున్నారు. మాచాపూర్ శివారులో హైదరాబాద్ నుంచి హర్యానాకు వెళ్తున్న లారీ, కారును బలంగా ఢీకొట్టడంతో పూల్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో నారాయణ్‌ఖేడ్‌కు చెందిన తల్లి స్వరూప, కూతురు చిట్టి తలకు తీవ్రగాయాలవ్వడంతో హైదరాబాద్‌కు తరలించారు. జ్యోతి, శోభ, వినీత, సునీతలను ఎల్లారెడ్డిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రానికి సమీపంలోని చిన్న మల్లారెడ్డి క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ప్రయాణికులతో వెళ్తున్న ఆటో రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్న మల్లారెడ్డికి చెందిన నలుగురు, లింగంపేట మండలం శెట్టిపల్లి సంగారెడ్డికి చెందిన మరో వ్యక్తి గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


పారాలి (ఫైల్)

మాచారెడ్డి : మండలంలోని లచ్చాపేట గ్రామశివారులో ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. గజ్యానాయక్ తండాకు చెందిన లావుడ్యా పారాలి (45) సొంత పనిపై లచ్చాపేట నుంచి కాలినడకన తిరిగి వస్తుండగా రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దేశాయిపేటకు చెందిన జక్కుల దేవేందర్ పొలం చుట్టూ అడవి పందుల కోసం అమర్చిన కరెంటు వైర్లు తగిలాయి. దీంతో పారాలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలాన్ని ఏఎస్పీ చైతన్యరెడ్డి, రూరల్ సీఐ రామన్ శనివారం పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడు ..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన శ్రీకాంత్(23) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై వంశీ చందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా.. శనివారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో జాన్కంపేట్ శివారులో ట్రాక్టర్ డ్రైవర్ సిరివెని రవి అటుగా వెళ్తుండగా శ్రీకాంత్ లిఫ్ట్ అడిగి ఎక్కినట్లు తెలిపారు. ఆకస్మాత్తుగా ట్రాక్టర్ మీది నుంచి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

ఎల్లారెడ్డి: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ శనివారం అందజేశారు. ఎల్లారెడ్డిలో ఇటీవల లక్ష్మణ్, గంగారాం, చాకలి సిద్ధయ్యలు సెల్‌ఫోన్ పోయిందని సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

తాడ్వాయిలో అగ్ని ప్రమాదం


కాలిబూడిదైన సామగ్రి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. రూప అనే మహిళ అద్దె ఇంట్లో ఉంటూ శబరిమాత ఆశ్రమం వద్ద ప్యాలాల దుకాణం నడుపుతూ జీవిస్తోంది. శనివారం ఎక్కడి నుంచో వచ్చిన నిప్పు రవ్వలు ఇంటిపై పడడంతో ప్లాస్టిక్ తాటిపత్రికి నిప్పంటుకుందని తెలిపారు. ఇంట్లో మంటలు వ్యాపించడంతో బియ్యం, బట్టలు, ప్యాలాలు, సర్టిఫికెట్లతోపాటు, రెండువేల నగదు కాలిబూడిదైనట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదంలో సుమారు 25వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతోంది.

బోధన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో..


బోధన్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

బోధన్: పట్టణంలోని 29వ వార్డు శివాలయం వీధిలో వెండి సాయిలు అనే వ్యక్తి పెంకుటింట్లో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో విలువైన పత్రాలు, కొంత నగదు పాక్షికంగా కాలిపోయాయని, సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాట్లిలిందని బాధితులు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

- తప్పిన భారీ ప్రమాదం


సారంగాపూర్ వద్ద బోల్తాపడిన గ్యాస్ సిలిండర్ల లారీ

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని సారంగాపూర్ సమీపంలో నిండు గ్యాస్‌తో ఉన్న సిలిండర్లను తరలిస్తున్న లారీ శనివారం సాయంత్రం బోల్తాపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..హైదరాబాద్ నుంచి సారంగాపూర్ డెయిరీఫాం వద్ద ఉండే గోదాముకు ఓ లారీ నిండు సిలిండర్లను తరలిస్తోంది. తాజ్‌దాబా వద్ద మూలమలుపునకు రాగానే ఒక్కసారిగా లారీ బోల్తాపడింది. దీంతో సిలిండర్లన్నీ కిందపడిపోగా.. ఆ శబ్దానికి స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు. సిలిండర్లు ఎక్కడ పేలుతాయోనని భయపడ్డారు. విషయం తెలుసుకున్న ఆరోటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్యాస్ సిలిండర్లను అక్కడి నుంచి తరలించారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు


- 5 తులాల బంగారం స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేశ్ , ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద(జుక్కల్): ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులనే టార్గెట్‌గా చేసుకొని ఆరు నెలలుగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితురాలిని బిచ్కుంద పోలీసులు పట్టుకున్నారు. బిచ్కుంద స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నరేశ్ వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం ఔరాద్ తాలూకా, కమల్‌నగర్ గ్రామానికి చెందిన శాంతాబాయి కొన్ని నెలల నుంచి బస్టాండ్‌లో రద్దీగా ఉన్న బస్సుల్లో ఎక్కుతున్న మహిళల మెడలో నుంచి బంగారు నగలు అపహరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు గోడమీది సాయవ్వ, గాండ్ల సాయవ్వ, దొమటి శకుంతల, సాయవ్వ తమ బంగారు నగలు పోయాయని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు కొన్నినెలల నుంచి బిచ్కుంద బస్టాండ్‌లో నిఘా పెట్టారు. శనివారం బస్టాండ్‌లో చోరీకి పాల్పడుతున్న శాంతాబాయిని పోలీసులు పట్టుకున్నారు. విచారణలో నలుగురు ప్రయాణికుల నగలు అపహరించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. శాంతాబాయి నుంచి 5 తులాల బంగారం స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బంది మహ్మద్ నదీమ్‌ను అదనపు ఎస్పీ నరసింహారెడ్డి అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కోసం కోతుల తిప్పలు



అప్పుడే ఎండలు మండుతున్నాయి. ఉష్ణతాపానికి మనుషులు అల్లాడుతుంటే.. తాగునీటి కోసం జీవాలు తిప్పలు పడుతున్నాయి. ధర్పల్లి మండలంలోని మద్దుల్ల లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయం నీళ్ల ట్యాంక్ వద్ద లీకేజీ నీటితో కోతులు దాహం తీర్చుకుంటూ 'సాక్షి' కెమెరాకు కనిపించాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సదరం శిబిరాల్లో సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: సదరం శిబిరాల్లో వైకల్య నిర్ధారణ కోసం వచ్చే వారికి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సదరం సేవలను సులభతరం చేస్తూ ఇటీవల కొత్తగా యూనిక్ డిజెబిలిటీ ఐడీ (యూడీఐడీ) పోర్టల్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై శనివారం సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ చాంబర్ నుంచి వీసీలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. సదరం సర్టిఫికెట్ల కోసం ఇక నుంచి యూడీఐడీ పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. దరఖాస్తుదారులకు సదరం శిబిరానికి ఎప్పుడు హాజరుకావాలనేది ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. దరఖాస్తు సమయంలో అక్షర దోషాలు, ఇతర తప్పులకు ఆస్కారం లేకుండా మీ సేవ నిర్వాహకులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇప్పటి వరకు ఐదు రకాల కేటగిరీల వారికే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేదని, కొత్తగా రూపొందించిన యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల కేటగిరీలను చేర్చారని కలెక్టర్ వెల్లడించారు. సదరం సర్టిఫికెట్లను స్మార్ట్‌కార్డు రూపంలో పోస్టల్ శాఖ ద్వారా ఇంటికి పంపిస్తారని తెలిపారు. చేయూత పెన్షన్ తోపాటు ఇతర సంక్షేమ పథకాల కోసం సదరం స్మార్ట్ కార్డు చెల్లుబాటవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్డీవో సాయాగౌడ్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ప్రాణం ఖరీదు రూ.4.50 లక్షలు!

- గత నెల 26న స్విమ్మింగ్‌పూల్‌లో పడి యువకుడి మృతి
- రాజీ కుదిర్చిన రాజకీయ నేతలు
- మొదట రూ.2 లక్షలు.. కేసు విత్‌డ్రా రోజు రూ.2.50 లక్షలు చెల్లించేలా డీల్

ఖలీల్‌వాడి: కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండే యువకుడి ప్రాణానికి వెలకట్టినట్లు ప్రచారం జరుగుతోంది. వివరాలు ఇలా.. నగరంలోని ఆరోటౌన్ పరిధిలోని జ్యామ్ స్విమ్మింగ్‌పూల్‌లో ఫిబ్రవరి 26న నిజాంకాలనీకి చెందిన సయ్యద్ అశ్రఫ్(22) మృతి చెందాడు. ఈత నేర్చుకునేందుకు అశ్రఫ్ స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లగా.. కోచ్ అందుబాటులో లేకుండానే ఈతకు అనుమతించారు. దీంతో నీట మునిగి అశ్రఫ్ మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, స్విమ్మింగ్ పూల్‌ను తెరిపించుకునేందుకు యాజమాన్యం స్థానికంగా ఉండే ఓ పార్టీ నాయకులను ఆశ్రయించింది. కేసు విత్‌డ్రా చేసుకుంటే నష్టపరిహారం అందిస్తామని నేతలు మృతుడి కుటుంబానికి చెప్పినట్లు సమాచారం. స్విమ్మింగ్‌పూల్ యజమానితో అదే ప్రాంతంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బేరసారాలు మొదలు పెట్టారు. చివరికి నిండు ప్రాణం ఖరీదు రూ.4.50 లక్షలుగా పార్టీ నాయకులు వెలకట్టారు. రాజీలో భాగంగా మృతుడి కుటుంబానికి మొదట రూ. 2లక్షలు, కేసు విత్‌డ్రా సమయంలో మిగితా రూ.2.50లక్షలు చెల్లించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఇదంతా ఎన్నికల కోసమేనా!

కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల సమక్షంలో ఉండేందుకు సదరు పార్టీ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల ఓ భూ వివాదంలో సదరు పార్టీకి చెందిన నేతలు ఓ అధికారితో వాగ్వాదానికి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. పంచాయితీల్లో సదరు పార్టీ నేతలు తలదూర్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఓ నిండు ప్రాణానికి వెలకట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై సౌత్ సీఐ సురేశ్ కుమార్‌ను వివరణ కోరగా సయ్యద్ అశ్రఫ్ మృతిపై కేసు నమోదు చేశామని, స్విమ్మింగ్‌పూల్ మూసివేత కోసం కార్పొరేషన్ అధికారులకు లేఖ అందించినట్లు తెలిపారు. అశ్రఫ్ ప్రాణానికి ఖరీదు కట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లిలో దొంగల బీభత్సం

- రెండిళ్లలో చోరీ
- రూ.5.20 లక్షల నగదు, తులం బంగారం, వెండి అపహరణ


వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. రెండిళ్లలో చోరీకి పాల్పడి నగదు, బంగారం అపహరించుకుపోయారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మినుముల గంగాధర్ సొంతింట్లో ఒక గదికి తాళం వేసి పక్క గదిలో పడుకున్నాడు. పక్క గది తాళం పగులగొట్టి దుండగులు లోపలికి ప్రవేశించారు. బీరువాలోని రూ. 5 లక్షల నగదుతోపాటు, 5 గ్రాముల బంగారం, 12 తులాల వెండి నగలు ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి 2 గంటలకు ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ఎలక్ట్రిక్ బైక్ హార్న్ మోగడంతో గంగాధర్ నిద్రలేచి తలుపు తెరవబోగా, బయటి నుంచి గొళ్లెం పెట్టి ఉండడంతో తెరుచుకోలేదు. తెలిసిన వారికి ఫోన్ చేయడంతో వారు గంగాధర్ ఇంటికి చేరుకోగానే దొంగలు పరారయ్యారు. కాగా, ఎంఈవో ఆఫీస్ సమీపంలోని వాస్కార్ శ్రీనివాస్ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. శ్రీనివాస్ కొంతకాలంగా సొంతింట్లో కాకుండా సమీపంలో అద్దెకు ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం శ్రీనివాస్ భార్య సొంతింటికి వెళ్లగా తాళం పగులగొట్టి ఉండడంతో దొంగతనం వెలుగు చూసింది. దుండగులు బీరువా తెరిచి అందులోని రూ. 20 వేల నగదు, 5 గ్రాముల బంగారం అపహరించుకుపోయారు. బాధితుల సమాచారం మేరకు ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనా స్థలాలకు చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కిష్టాపూర్‌లో..

బాన్సువాడ : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన నార్లపల్లి భూమయ్య ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పది రోజుల క్రితం భూమయ్య అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని నగదు, బంగారం కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.